# విచ్చిపోయిన మబ్బు

హరిబాబు

శ్రీవంతం వెళ్ళిపోతుంది

వస్తోంది మరో గంట లో - ప్రతి గంటకు ఒక లెక్క—.

ముకుందరావు నడుస్తున్నాడు.

వీధి దీపాల వెలుగు తన మీద పడకుండ నీడలలో నే నడుస్తున్నాడు. అయినా వెలుగుకొంత మీద పడక తప్పటంలేదు. ఒక దీపం తన వెలుగును కొంత పరిధిలోనే వ్యాప్తం చేస్తున్నది. మరో దీపం చేరేలోపున చీకటి.

జీవితంలా వెలుగుచీకట్లు- చీకటి వెలుగులు

ఇల్లు చేరకూడదనుకొని ఎక్కడెక్కడో తిరిగినా అప్రయత్నంగా ఇంటివైపే నడిచాడు. ఇంటి గుమ్మంలో అడుగుపెట్టి తలుపుతట్టకుండా అలానే కొంతసేపు ని బడ్డాడు.

గుమ్మంముందు అలికిడి విని తలుపు తెరచింది-ముకుందరావు అలానే నిలబడి చూస్తున్నాడు శకుంతలవైపు.

నీడలో అతని ముఖకవళికలు గుర్తించ లేదు-"అదేమిటి అలా నేనిలబడిపోయారేం?" -అని అడ్డు తొలగింది.

ఇంటిదీపపు వెలుగు అతనిమీద ఒక్కసారిగ ప్రసరించింది. వెలుగు భరించలేనట్లు ముఖం ప్రక్కకు తిప్పుకొని లోపలికి నడిచాడు.

కుర్చీలో మాట మంతిలేకుండ కూర్చున్న ముకుందరావు దగ్గరగా వచ్చి-"అలా ఉన్నారేం!"-అంది.

శకుంతలదృష్టి తప్పించుకొని "అబ్బే! బాగానే ఉన్నా"-అని లేని హుషారుతో గబగబా షర్టువిప్పి భార్య చేతిలో పెట్టాడు.



"వేన్నీళ్ళున్నాయి - స్నానం చేయరూ!" -అన్నది.

"ఓ-" అన్నాడు. తన భావన ఆమెకు తెలియకూడదు.

స్నానానికని వెళ్ళిన తానేమి చేస్తున్నాడో తెలియక ముఖం, కాళ్ళూ చేతులూకడుక్కొని తిరిగి వచ్చేశాడు.

శకుంతల కిదేం అర్థం కానట్లు చూస్తూ"స్నానంచేస్తానన్నారు"- అన్నది.

రాని చిర్నవ్వును ముఖంమీకి తెచ్చుకొని – "పొయ్య బుద్ధికాలేదు" అన్నాడు.

'వడ్డించనా'-అనడిగింది.

'ఊఁ-' అన్నాడు.

ప్రక్కనకూర్చొని వడ్డిస్తున్నది శకుంతల. అతనెంత పరధ్యానంగా ఉన్నాడో అప్పుడే గ్రహించింది. రోజూ ఇంటికి రాగానే మొదటి ప్రశ్న - శశివు జేడీ-అనికొడుకు గూర్చి. ఇవాళ అసలా ప్రసక్తే

లేదు. అయినా తాను గుర్తించినట్లు బహిర్గతం కాలేదు.

నేతితో పూర్తిగా చేయితడవనిదే తినని వాడు పచ్చడి కలుపుకొని నెయ్యి అడగకుండానే తినివేస్తున్నాడు-శకుంతల ఏమీ మాట్లాడకుండా నెయ్యి వేసింది.

"మజ్జిగ"-అన్నాడు.

"చారు కలపండి" అంది.

చారన్నం తిని చెయ్యి కంచంలోనే కడిగివేశాడు.

"మజ్జిగ వేసుకోలేదు, చెయ్యి కడిగేశారు"-అంటూ ప్రక్కనున్నమట్టు గిన్నెలో అన్నంవేసి మజ్జిగపోసింది.

శకుంతల ముఖంలోకి చూశాడు. ఆమె నిండు నవ్వులో దైన్యం రేఖగా స్ఫురించింది. ఆమె తనను తరచి తరచి చూస్తున్నట్లు భావించాడు. ఏదో జాలిపడుతుంది. బాధపడుతుంది అనుకొని- ఒక్కసారి అంతా నటన అనుకొంటూ-'ఆకలిలేదు' అని లేచిపోయాడు.

ఆమె అలానే కంచంవైపు, గిన్నెలవైపూ చూస్తూ కూర్చుండిపోయింది.

భోజనం చేసిందో లేదో అన్నట్లు - ముకుందరావు పట్టెమంచపు కోడుపట్టుకు దిండు వేసుకొని ఆనుకొనేలోపునే వచ్చింది. చేతిలో పళ్ళెంనిండా ఆకులు, వక్కపొడి కున్న పుసీసాలున్నాయి.

భర్తప్రక్కనే తానూ కూర్చుని వక్కపొడిసీసా అందించింది - ముకుందరావు ముక్తసరిగా 'వద్దు' అన్నాడు. అసలామాట వినిపించుకోనట్లు వక్కపొడి చేతిలో వేసుకొని - 'నోరు తెరవండి'— అన్నది.

వక్కపొడి నోట్లో ఎలావేసిందో అలాగే ఆకులకు సున్నం రాసి నోటి కందించింది. తానూ రెండు ఆకులు నోట వేసుకొని పళ్ళెం అవల బల్లమీద పెట్టి భర్త దగ్గరగా జరిగింది.

శకుంతల ముఖంలోకి ఎలానో చూశాడు. ఆమె నిండుగా నవ్వింది. ఎఱ్ఱని పెదాలు తనని వెక్కిరిస్తున్నట్లుగా తోచింది. భరించలేని తన చూపులు దించివేశాడు.

భర్త భుజంపై చేతులేసి తనవైపు కొద్దిగా లాక్కొని "ఏవండీ! మీరెందుకో బాధపడుతున్నట్లున్నారు. నాకు చెప్పకూడదా"— అన్నది.

ముకుందరావులో కుబుసం కప్పకొని, నిద్రాణమై ఉన్న అనుమానం, భయం, బాధ ఒక్కసారి రెచ్చగొట్టబడినట్లు విజృంభించాయి. అతనిలోని ప్రతి అణువణువును కదల్చివేశాయి.

ఒక్కసారిగా శకుంతలను తన కెదురుగా తీసుకున్నాడు. సూటిగా కళ్ళలోకి చూస్తూ- "శకూ! నే నే ప్రశ్న వేసినా సమాధానం చెబుతావా?" అనడిగాడు కంపిత కంఠస్వరంతో

# విచ్చిపోయిన మబ్బు

శకుంతల నివ్వెరబోయింది. తనని గూర్చినా ఈ ఆలోచనంతా. తనను ఇలా ఎందుకు శంకించాడో అర్థంగాక దీనంగా "ఎప్పుడైనా-మీకు అబద్ధం చెబుతానండీ" అన్నది.

"చెప్పలేవు శకూ—చెప్పలేవు. ఏ ఆడదీ తన భర్త నే వేసే ప్రశ్న వేస్తే సమాధానం నిజంగా చెప్పదు. చెప్పినా- అది అబద్ధం" అన్నాడు దిగజారి పోతున్నట్లు.

శకుంతల అతని గుండెలపైన తల పెట్టుకుని రుద్ధకంఠంతో—"నన్ను మీరు నమ్మరా—నేను మీకు అబద్ధం చెబుతానని ఎందుకనుకుంటారు" అన్నది.

తన ఎదపై ప్రాలిన శకుంతల కణతలకు చెంపలాన్చి ముకుందరావు మెల్లగా "శకూ!

> ఉపాధ్యాయుడు : ఒరేయి కృష్ణా, రామునెందుకు కొట్టావ్?
>
> కృష్ణా : వాడు నన్ను తిట్టాడండి.
>
> ఉపా : నువ్వు తిట్టక పోయావా?
>
> కృష్ణా : వాడికి పుట్టెడు చెముడండి!
>
> — రాజరావు (పిల్లుట్ల)

నేనంటే నీ కిష్టమేనా! నీకు నామీద గౌరవముందా!" అనడిగాడు.

శకుంతల అలానే భర్తవంక చూస్తూ— "నన్నెందుకిలా అడుగుతారు?-మీకు నేనేం లోటు చేశాను? ఎప్పుడైనా మిమ్మల్ని నేను చిన్నమాటైనా అన్నానా" అంటూనే సన్నటి ఏడుపుజీరస్వరంలో కలిపింది.

ఆమె చెంపలని రెండు చేతుల్లోకి తీసుకొని "ఏడవకు శకు- ఏడవకు. నువ్వేడిస్తుంటే నేనస లడగ దలచింది అడగలేను" అన్నాడు.

శకుంతల ఏడుపు దిగమ్రింగింది. ఇటుపై తనమీద పడే ప్రశ్న ఏదాన్నట్లు చూస్తూ భర్తకు హాసిగా అతడి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని గాదదికంగా—"దైవసాక్షిగా నాకు తెలిసినవి తెలిసినట్లే చెబుతాను—మీవద్ద ఏవీ దాచను" అన్నది.

తిరిగి ఉద్రిక్తుడైపోయాడు ముకుందరావు.

భార్య భుజాలు పట్టుకొని ముఖంలోకి చూస్తూ—"నువ్వు నిజం చెబుతావా దైవసాక్షిగా—శకూ" అంటూ ఆమె మెడలోని హారాల మధ్య ఉన్న మంగళసూత్రం ఆమె చేతిలో పెట్టి—తన చేతులతో బంధించిపెట్టి —"దీని సాక్షిగా నిజం చెప్పు శకూ—ఏ స్త్రీకూడ తన తాళి తెగాలనుకోదు. దీనిమీద ఒట్టువేసి చెప్పు నిజం" అన్నాడు.

శకుంతల వణికిపోయింది. అలానే—"దీని సాక్షిగా నిజం చెబుతాను" అన్నది.

"శకూ! ప్రశ్న వేసేముందు నేనెందుకీ ప్రశ్న వేస్తున్నానో—ఎందుకు వేయాల్సి వచ్చిందో చెబుతాను. నువ్వు కాదనలేవు. నేనేవీ కల్పించి చెప్పడంలేదు. చూశాను" అన్నాడు.

ఏం చెబుతాడోనని శకుంతల ఉచ్ఛ్వాస నిశ్వాసలకు స్వల్ప అవరోధాలు కల్పిస్తూ అతడి ముఖంలోకి చూస్తున్నది. ముకుందరావుతనమనోభావాలలో తులకుదిగిపోయాడు. అతని కంఠ మొక మోస్తరు గంభీర ధ్వనిగా ప్రోగింది-

"శకూ! నేను రెండవ పెండ్లి చేసుకోవడం తప్పని చేసుకొనేప్పు డనుకోలేదు. నిన్ను చేసుకోవడం నాకోసం కన్న శేకవుడి కోసం చేసుకున్నాను—వాడికి తల్లిలా నేను పరిచర్య చేయలేనేమోనని. వాడి అదృష్టం—వాడిని కన్న తల్లికన్నా ఎక్కువగా చూసుకొనే నువ్వు దొరికావు. నేనే స్వార్థంతో నిన్ను చేసుకున్నానో అది నెరవేరింది- కాని నీకు అన్యాయం చేస్తున్నాననుకోలేదు. నేను వట్టి అల్పుడినని, నిర్జీవుడనని పెండ్లికి పూర్వమే నువ్వు గ్రహించి ఉండాలి. కాకపోతే....—"అని ఆగాడు.

శకుంతల రుద్ధకంఠంతో "ఎందుకలా అంటారు - మీరు..."—అని ఇంకా ఏదో చెప్పబోయింది.

ముకుందరావు ఆమెను చెప్పనివ్వలేదు.

"శకూ—నా మాటకు అడ్డురాకు. నేనొక్కబిగిని చెప్పలేక పోతున్నాను.—లేదు చెబుతాను విను—. నీకు జ్ఞాపకం రావచ్చు. నిన్నింకా కాపురానికి తీసుకురాలేదు. నేను రెండవ పెండ్లివాడినైనా ముసలివాడిని మాత్రం కాను. నీ వెక్కడున్నా నా మన సక్కడే ఉండేది. నీదగ్గరకు వచ్చిఉండాలని-నా మనసు కొట్టుకులాడిపోయేది."

ఒక్కక్షణం ఆగాడు.

"ఖమ్మంమెట్టు వరంగల్లులో నువ్వు మీ అక్క మామలదగ్గర ఉన్నావని విని దిగాను. నువ్వక్కడున్నావని తెలీనట్లు మీ మామతో మాట్లాడాను వాళ్ళ ఆఫీసుకెళ్ళి. ఏదో ఆఫీసు పనిమీద వచ్చానన్నాను. నువ్వూ అక్కడే ఉన్నావని చెప్పి ఇంటికి తీసుకొచ్చాడు. నా కన్న నీ మామ చిన్నవాడు. నీకు మామేగాక అక్కమగడు గనుక చనువు హెచ్చు. అందుకే వాళ్ళింటి కెళ్ళావనుకున్నాను."

"నన్ను ఇంటికి తీసుకొచ్చి కూర్చోబెట్టాడు. నేను కూర్చొనిఉన్న పడకకుర్చీ ఎదురుగా గోడకిపైన వెంకటేశ్వరస్వామి పటం ఉన్నది. నా వెనుకగదిలో నువ్వు మంచంమీద కూర్చొనిఉన్నావు. నే ననుకోలేదు నువ్వు. నీ మామ ఆ గదిలోకి వచ్చాడు.

వాడు ఆ గదిలో ఏం జరిగినా కనబడ దను కున్నాడు. నేనక్కడ కూర్చొని ఉన్నా ననే జ్ఞానంకూడ లేకుండా — నీ దగ్గరకువచ్చి గుచ్చిఎత్తి కౌగిలించుకున్నాడు. నువ్వు అతడికి ప్రతిగా చుట్టుకుపోయావు. నేను వచ్చానని గట్టిగా నాకు వినబడేటట్లు చెప్పాడు. నువ్వతడిని విదల్చుకొని భయంగా బయటకొచ్చావు. నేను—లోపల దహించుకు పోతున్నా — వెనుతిరిగి చిన్న నవ్వు నవ్వాను. నువ్వు స్థిమితపడ్డావు — నేను కనుగొనలేదని. జ్ఞాపకం వచ్చిందా శకూ!"—అంటూ శకుంతల ముఖంలోకి చూశాడు.

శకుంతల కళ్ళు విప్పార్చి దిగ్భ్రమ చెంది అలా చూస్తూ కళ్ళ వెంట నీరు కారుస్తున్నది.

"అబద్ధమా అని అడగడంలేదు శకూ— నిజం. నేను చూశాను. అది నిజం. అందుకే —ఆరోజే నావెంట నిన్ను మీ ఊరు తీసుకెళ్లి కాపురానికి పంపమని అక్కడనుండి మరునాడే ఇక్కడకు తీసుకొచ్చాను. నువ్వు చాల బాధపడ్డావు అలా అందర్నీ వదలి రావటానికి. తరువాతనైనా నీ మామను మరచి పోతావనుకున్నాను."

"గోవిందరాజోత్సవాని కెళ్లినప్పుడు నీ మామా వచ్చాడు మీ ఊరు. నీకెంతో సంబ్రమయింది. నేను నీకు వచ్చికోవా ఇష్టమని ఉత్సవంనుండి తెచ్చాను. నా ఎదుట తిన లేదు. నేనటు వెళ్ళగానే సగం నీ మామ నోట పెట్టావు. నేను బయటకువెళ్తూ కిటికీ గుండా చూశాను. అబద్ధమంటావా శకూ!— కాదు. నేను చూశాను. అంతే ఆనాటినుండి ఈనాటివరకు నిన్ను మీ ఇంటికి పంపలేదు. సంవత్సరమైందని గిజగిజ లాడినా పంప లేదు."

"ఈనాడు తప్పదు. ఇవాళ కాకపోయినా తొమ్మిదోనెలనైనా పంపాల్సిందే— తప్పదు. కాని నిన్ను పంపుతుంటే నీ మామకు ఎరగా పంపుతున్నట్లుంది నాకు. అందుకే మొన్న నీ మామవచ్చి తాను వెంట పెట్టుకెళ్తానంటే చాల మొరటుగా పంపను పొమ్మన్నాను. రేపు ప్రొద్దుట నువ్వు వెళ్లి పోతావు"—అని శకుంతల చేతుల్ని వదలి ఆమె భుజాలచుట్టూ చేయివేసి—"శకూ! ఇది నిజం—అబద్ధం అని చెప్పమనడంలేదు. ఒక్క విషయం నీ మాంగల్యం సాక్షిగా చెప్పు. ఇకపై నీ మామతో అలా సంచరించవు కదూ—అను శకూ!—నా ఆత్మతృప్తి కన్నా—నా ఆత్మశాంతికోసం అను..." అన్నాడు దీనంగా ఉద్రేకంగా—

ఇప్పటివరకు రాపడి కూర్చున్న శకుంతల ఒక్కసారి గట్టిగా ఏడుస్తూ భర్త పాదాలపై పడింది. మంగళసూత్రం చేతిలో ఉంచుకొని అలానే ఏడుస్తూ "నన్ను క్షమించండి— నేనెప్పుడూ ఇక అలా చెయ్యను. ప్రమాణం చేసి చెబుతున్నాను. నా పసుపు కుంకుమల సాక్షిగా నేనలా చెయ్యను. అలా ప్రవర్తించను"—అంటూ ఆయాసంతో స్పృహతప్పి పోయింది.

ప్రొద్దుట శకుంతలను బండికి పంపే వేళ యింది.

కేశవుడు అమ్మతో వెళ్తానని తండ్రి చేయి పట్టుకొని లాగుతూ మారాము చేస్తున్నాడు. రిక్షాలో సామానులు పెట్టించి గడపలో నిల బడ్డాడు కొడుకు గారవాన్నంత పట్టించుకో కుండా.

శకుంతల దగ్గరగావచ్చి దీనంగా భీతితో చూసింది. వంగి పాదాలనంటి కండ్ల నద్దు కొంది. శకుంతలను లేవదీశాడు.

"శకూ!—సుఖంగా వెళ్ళిరా" అన్నాడు.

ఆ మాటలు తేలికగా పలకలేదు. నాభి నుండి వచ్చినట్లున్నాయి. భర్తను చూసింది. కన్నీళ్లు చెక్కిళ్ళపైకి దొర్లాయి.

"ఛ!—అదేమిటి. వెళ్లు — నిన్న రాత్రే నా మనసులోని చెడుగునంతా కడిగి వేసు కున్నా. వచ్చేటప్పుడు పండంటిపిల్ల నెత్తు కురా"—అన్నాడు.

ఒక్కక్షణముండి బొంగురుపోయిన కంఠం తో— "కేశవుడిని నాతో పంపకూడదూ—" అన్నది.

శకుంతలను గట్టిగా పట్టుకొనున్న కేశవుడి తల నిమురుతూ "వద్దు—వీడిని ఉండనీ, చదువు చెడటమే గాక నువ్వూ వీడులేకుండా నేనొంటరిగా ఉండలేను"— అన్నాడు.

ముకుందరావు బయటికెళ్లాడు. శకుంతల ఒకసారి ఇంటినంతా కలయజూచి బయటకు వచ్చేసింది కేశవుడితో.

రైలు కదలిన తరువాత కేశవుడిని పట్టుకోవటం కష్టమైంది. వెళ్తున్న రైలునుండి శకుంతల కేశవుడి ఏడుపుచూసి తను దుఃఖాన్నాపుకోలేక చెంగు నోట కుక్కుకుంది.

పెద్దపెట్టున ఏడుస్తున్న కొడుకుని తీసుకొని ఇంటికొచ్చాడు. ఇల్లంతా బోసిపోయి నట్లనిపించింది. కేశవుడిని ఒడిలో పెట్టుకొని అలానే మధ్యాహ్నం వరకు కూర్చుండి పోయాడు.

శకుంతల వెళ్తూ ఆనాటికి వంట చేసి పెట్టి వెళ్లింది. కొడుక్కి వెళ్లేముందు తన చేతులతో తినిపించాలని వేళ కాకపోయినా తినిపించింది. వాడూ అన్నం పెట్టమని అడగలేదు. తనకు ఆకలి కాలేదు.

ఏడ్చిఏడ్చి నిద్రపోయిన కేశవుడు లేచి తిరిగి ఏడవసాగాడు. వాడిని భయపెట్టి బతిమాలి ఊరుకోబెట్టాడు. ఆకలంటే, ఇప్పుడు అన్నమేమిటని హోటల్‌కు తీసుకెళ్లాడు.

రాత్రి భోజనం పెట్టినప్పుడు కేశవుడితో బాధ పడలేకపోయాడు.

కేశవుడి కన్నతల్లి చనిపోయేప్పటికి వాడికి నాలేళ్లు. జబ్బుతో తీసుకు చనిపోయింది కాబట్టి తాతగారింట్లో పెరిగాడు. కాని ఎంతకాలం చూస్తారు. ఒక ఏడు దాటగానే పెళ్ళిచేసుకోమన్నారు ముకుందరావును.




ఈ సినీనటుడు
మూలవ్యాధితో
మిక్కిలి బాధపడి
కోపముతో
మండిపడుచుండెను.
హెడంజా
ఆయనకు
పూర్తినివారణ నొసగెను




హెడంజా మూలశంకను,
నెత్తురు పడుటకు, చర్మపు పగుళ్లను
వెంటనే దిరమైన నివారణ కలిగించును.
నొప్పి దురదలను పోగొట్టి మలమును
సుఖముగా జారునట్లు చేయును.

హెడంజాలో తిమ్మిరెక్కునట్లు చేయగల మందు లేవి లేవు. మరియు వస్త్రములను ఖరాబుచేయదు.

Z-644 A TG

తనకోసం కాదు కేశవుడి కోసమనుకొని చేసుకున్నాడు. కన్నతల్లివద్ద కరవైన ప్రేమ శకుంతల దగ్గర లభించింది. తన కడుపునకల్గిన బిడ్డడిని చూసుకున్నట్లు చూసుకొంటుంది. అందుకే శకుంతలను వదలి ఉండలేడు కేశవుడు. కేశవుడిని చూసుకోలేదు ముకుందరావు.

## విచ్చిపోయిన మబ్బు

రాత్రి మూడుసార్లు మంచినీళ్ళకని లేచాడు. వీపు గోకమని—గాలిలేదు విసరమని వేధించాడు. విసుక్కుంటే తల్లికోసం తిరిగి ఎక్కడ ఏడుస్తాడోనని భయం.

ప్రొద్దుట లేచేసరికి ఏడయింది.

వాడితో ముఖం కడిగించటం ఒక ప్రళయమయింది. పళ్ళు తోమమంటాడు. వాడిచే తోముకోమంటాడు ముకుందరావు. ఎలా తోముకోవాలో చూపాడు. కేశవుడు వ్రేలితో పొడి తీసుకొని పళ్ళపై పూత పూస్తుంటే





రెక్సోనా సబ్బు మీ చర్మమును అతి సొగసుగానుంచును

ఆస్ట్రేలియాలోని రెక్సోనా ప్రొ.లి., తరఫున హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ వారిచే భారతదేశంలో తయారు చేయబడినది. RP.165-X52 TE

విసుగ్గా తనే తోమాడు. కేశవుడు ఒక్కటే ఏడుపు గోరు బుగ్గలో గ్రుచ్చుకుందని. రక్తం వస్తుంటే వాడిని సముదాయించలేక బాధ పడ్డాడు.

ప్రొద్దుటే కాఫీ తాగించి పదింటికల్లా హోటల్ నుండి భోజనం తెచ్చి కేశవుడికి తినిపించి తాను తిని ఆఫీసుకి బయలుదేరాడు. వాడి బడికీ, తన ఆఫీసుకీ ఆలస్యమయింది.

సాయంత్రం వచ్చేసరికి వీధి అరుగుమీద కూర్చొని ఏడుస్తున్నాడు కేశవుడు. తండ్రిని చూసి ఇంకా ఎక్కువ చేసాడు—ఆకలేస్తుందని ఏడుపు. ముకుందరావు బాధపడ్డాడు. ప్రొద్దుటనగా తిన్నాడు. మధ్యాహ్నం తినలా ఏదైన కొనుక్కు తినటానికి డబ్బులు ఇవ్వలేదు. ఆ సంగతే ఆలోచించలేదు. కండ్లలో నీళ్లు తిరిగాయి.

రోజూ ఇలానే కేశవుడితో తాననుభవించే సాధక బాధకాలు విచిత్రంగా కనబడాయి. ఒకో రోజు శకుంతల వీడితో ఎలా వేగిందిరా అనుకొనేవాడు.

సుఖంగా చేరినట్లు వచ్చిన ఉత్తరం తరువాత రెండు నెలలవరకు ఉత్తరాలు లేవు. ఒకరోజు కార్డు - ఆడపిల్ల పుట్టిందనీ తల్లీ పిల్లలు కులాసా అని వచ్చింది. శకుంతల మామ వ్రాసాడు.

కేశవుడికి - చెల్లెలు పుట్టిందని చెప్పాడు. వాడెంతో ఆనందపడ్డాడు. చెల్లి ఎలాగుంటుందనీ, ఎంత ఉంటుందనీ తాను ఎత్తుకో వచ్చా అని మాటిమాటికి ప్రశ్నలతో వేధించాడు. ఆఖరుకు "చెల్లెల్ని చూడటానికి పోదాం — నాన్నా" అంటూ మారాము చేశాడు.

ఉత్తరంలో ఒకసారి రమ్మనికూడ లేదు. ముకుందరావుకు వెళ్ళాలనే ఉంది. తనకు పిలుపులేదు. పైగా ఆ ఉత్తరం వాళ్ల మామ వ్రాశాడు.

కేశవుడి అల్లరెక్కువయింది. అమ్మను చెల్లెను వెంటనే చూడాలంటాడు. ఏడుస్తూ కూర్చుంటాడు. తీసుకు వెళ్దామంటే వాళ్ల దగ్గరనుండి బారసాలకైన రమ్మని ఉత్తరం లేదు. ఇక భరించలేక నెలాఖరుకు ఉత్తరం వ్రాసాడు ముకుందరావు — కేశవుడు అమ్మ అమ్మ అని కలవరిస్తున్నాడనీ, వీలైనంత త్వరలో రమ్మని—.

ఉత్తరం లేదు. శకుంతల కేశవుడిపై చూపే ప్రేమంతా నటన, వెళ్ళిందగ్గరనుండి ఉత్తరమైనా వ్రాయలేదు. తనకు ఎన్ని చెప్పిందో — అన్నీ కల్లబొల్లి మాటలనుకున్నప్పుడల్లా గుండెను పిండినట్లనిపించేది.

కేశవుడికి హోటల్ తిండి. మధ్యాహ్నం చిరుతిండ్లువలన పూర్తిగా ఆరోగ్యం క్షీణించింది. శకుంతలవస్తే పదిరోజుల్లో సర్దుకుంటాడులే - అనుకొనేవాడు ముకుందరావు.

పిల్లకు రెండు నెలలు నిండుతాయి. ఇన్నాళ్ళు తన తలుపే లేకుండా శకుంతల ఉండగలిన దనుకొనేసరికి ఆడజాతి సంతతిని తిట్టుకొనేవాడు.

కేశవుడి వళ్ళు నలతగా ఉంటూ జ్వరంగా మారింది. ఏమీ తినకపోగ వాడికి - అమ్మ- అనేమాట తప్ప మరేమీ లేదు. రాత్రులు తల్లిని కలవరించేవాడు. వారం తిరక్కముందే చిక్కి శల్యమైనాడు.

జ్వరంతగ్గింది కాని కేశవుడిప్పుడు మాట్లాడటం మానివేశాడు. నోటిలో ఏం పోసినా ఉమ్మివేస్తాడు. ముకుందరావు బెదిరించినా ముఖంలో ఏమార్పులేకుండా అలాగే చూస్తాడు. ఎప్పుడైన ఏం కావాలని అడగ్గా అడగ్గ ముఖాన్ని దిండులో దాచుకొని ఏడుస్తూ - అమ్మ - అంటాడు.

కేశవుడినిలా ఉంచితే తనకు దక్కడనుకొని ఒకరోజున - "పదనాన్న! అమ్మ దగ్గరకు" - అన్నాడు ముకుందరావు.

రైలుదిగేసరికి రాత్రి పదయింది. ఒక్క బండికూడ లేదు. కొడుకును భుజాన వేసుకు నడిచాడు. శకుంతల ఉండే వీధిలో అడుగు పెట్టగానే దుఃఖం పొంగుకొచ్చింది. శకుంతల రాకపోయినా, రమ్మని వ్రాయకపోయినా ఆత్మాభిమానం చంపుకు తను వెళ్తున్నందుకు-

ఇంటి గుమ్మపు పైమెట్టు దగ్గర ఆగాడు. లోపలినుండి విస్పష్టంగా శకుంతలమాటలు వినవస్తున్నాయి.

"మీ మనసులో ఇంతకాలం ఈ ఊహ పెట్టుకొనే నన్ను పంపలేదని తెలీదు. వారినుండివచ్చిన ఉత్తరాలేవీ నాకందకుండా దాచేశారు. వారికి నేను వ్రాసిన వాటినన్నీ పోస్టులో పడకుండా చూశారు. ఈ ఉత్తరాలన్నీ నీపెట్టెలో దొరికాయి. మాతురి శుభాన్ని కోరి ఒక తల్లి చేసే సేవ నినువ్వ చెయ్యలేదు. ఇక ఒక్క క్షణం ఇక్కడ ఉండను. నన్ను మావారినుండి వేరు చేస్తే రోగంతో ఉన్న నాన్నతో సహా మగదిక్కులేక అతడి అండ చేరుతామని - అక్క ఆస్తితోబాటు నా ఆస్తినీ అనుభవిద్దామనీ మామ కుట్ర - తెలుసుకో - ఈ ఇల్లు నాకు నరకం. ఈ అంధకారంనుండి నే పోతున్నాను"— అని శకుంతల కంఠం.

"ఈరాత్రి వేళ ఎక్కడికెళ్లావు" అన్నాడు అధికారపూర్వకంగా-ఎవరో కాదు 'మామ'.

"ఈ ఇంట్లో ఉన్న చీకటికంటే బయట ఉన్నదే నాకు వెలుగు. నా విషయంలో నీవేమీ జోక్యం కలుగజేసుకో నవసరంలేదు. మా ఊరు నాకు బాగా పరిచయమే. ఎక్కడికో నాకే తెలీకుండా వెళ్తున్నాననుకుంటున్నావేమో - రైలుస్టేషన్‌కు దారి తెలుసు. మరో గంటలో బండికూడ ఉంది" అంటూ తలుపు తెరిచింది శకుంతల—.

లోపలినుండి వచ్చిన దీపపు నిండు వెలుగులో పాలిపోయినముఖంతో ముకుందరావు- ఎముకల ప్రోవులాఉన్న కేశవుడుకనబడ్డారు.

కేశవుడు హీన స్వరంతో-"అమ్మా!"— అంటూ శకుంతలకాళ్లకు చుట్టుకున్నాడు. ★

గుమాస్తా గిరీశం తనకుఎప్పటికైనా మంచిరోజులువస్తాయేమో కనుక్కుందామని ఒక పేరుపడ్డ జోతిష్యుని దగ్గరకు వెళ్లాడు. ఆ జోతిష్యుడు రెండు ప్రశ్నలకి జవాబులు చెప్పడానికి ముందుగానే ఇరవై రూపాయలు పుచ్చుకున్నాడు.

గిరీశం (జోతిష్యునితో): రెండు ప్రశ్నలకి ఇరవై రూపాయలు చాలా ఎక్కువ కాదండీ?

జోతిష్యుడు: ఇంకమీ రెండవ ప్రశ్న ఏమిటి?

—జె. మాధవరావు (బుర్లా)



చిత్రకారుడు: ఎం. సుల్తాన్‌జమా (వైజాగ్)